ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
బుధవారం 10 జూలై 2024



అటకెక్కిన ఆహ్లాదం
మూలన పడ్డ బోట్ 8

చివరి ఆయకట్టు వరకు
సాగు నీరందాలి 8

డబుల్ ఇళ్లపై ఫోకస్



నూకపల్లి వద్ద పంపిణీకి సిద్ధంగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు

నూకపల్లి వద్ద నిర్మించిన ఇళ్లలో మౌలిక వసతుల కల్పనకు నిధుల కేటాయింపు

కష్టాలు గట్టెక్కుతాయని లబ్ధిదారుల ఎదురుచూపులు

జగిత్యాల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే జీహెచ్ఎంసీ తదుపరి అత్యధికంగా జగిత్యాలలో నిర్మాణమైన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఆశలు పెరుగుతున్నాయి. గత యేడాది అక్టోబర్ మొదటి వారంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ జరిగినప్పటికీ మౌలిక వసతుల కల్పన లేకపోవడంతో కొన్ని ఇళ్లు మినహా మిగిలిన ఇళ్లు నిరుపయోగంగా ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం జగిత్యాల డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కాలనీలో వసతుల కల్పనపై ప్రత్యేక ఫోకస్ పెట్టడం, ఇందుకు అవసరమైన నిధులు మంజూరు చేయడంతో లబ్ధిదారుల్లో ఆశలు మళ్లీ చిగురిస్తున్నాయి.

నూకపల్లి వద్ద 4,520 ఇళ్ల నిర్మాణాలు..

జిల్లా కేంద్రం సమీపంలోని నూకపల్లి వద్ద రూ. 280 కోట్ల వ్యయంతో 140 ఎకరాల్లో కేటాయించిన స్థలంలో నిర్మాణం పూర్తి చేసుకున్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల మొదటి విడత పంపిణీ కార్యక్రమాన్ని గతేడాది అక్టోబర్ 3న అప్పటి రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా జరిపారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జగిత్యాల పట్టణానికి 4,520 ఇళ్లను మంజూరు చేశారు. ఇందులో ఇప్పటికే 3,722 ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకొని మొదటి విడత పంపిణీని అప్పటి ప్రభుత్వం పూర్తి చేసింది.

కరువైన మౌలిక వసతులు...

నూకపల్లి వద్ద డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల తొలి విడత పంపిణీ పూర్తయి నప్పటికీ మౌలిక వసతులు లేకుండా పోయాయి. దీంతో పలువురు లబ్ధి దారులు ఇళ్లను పొందినప్పటికీ పట్టణంలోని పలు కాలనీల్లో అద్దె ఇళ్లలోనే నివాసం ఉంటున్నారు. కాలనీలో నివాసానికి యోగంగా వసతుల కల్పన జరగడం లేదు. ఇళ్లు పొందిన లబ్ధిదారులు వసతుల కల్పన కోసం ఎదు రుచూపులతో గడుపుతున్నారు. పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులకు పలు సందర్భాల్లో సమస్యలను విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. గతేడాది అక్టోబరు తొలివారంలో లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేసినప్పటికీ మౌలిక వసతుల కల్పనకు అవసరమైన పనులు పూర్తి కాలేదు. అప్పటి ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించినప్పటికీ తదుపరి వచ్చిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల వల్ల పనులపై పట్టింపు కరువైంది.

కొత్త సర్కారు ఫోకస్‌తో చిగురించిన ఆశలు...

రాష్ట్రంలో కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ సర్కారు నూకపల్లి డబుల్ బెడ్ రూమ్ కాలనీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి. జగిత్యాలకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్‌కుమార్ పార్టీని వీడీ కాంగ్రెస్‌లో చేరడం, వెనువెంటనే డబుల్ బెడ్ రూమ్ కాలనీలో అభివృద్ధి పనులకు నిధుల మంజూరుకై సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కోరడం జరిగింది. ఇందుకు స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాలతో ప్రభుత్వం నూకపల్లి డబుల్ బెడ్ రూమ్ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు అవసరమైన నిధులను ఇటీవల మంజూరు చేసింది.

రూ. 18.21 కోట్లతో వసతుల కల్పనకు నిధుల కేటాయింపు...

నూకపల్లి అర్బన్ హౌజింగ్ కాలనీలో నిర్మాణమైన ఇళ్ల వద్ద మౌలిక వసతుల కల్పనకు తోడు మిగిలిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడంపై ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ దృష్టి సారించారు. ఇందులో భాగంగా డాక్టర్ సంజయ్ కుమార్ ప్రతిపాదన మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబరు 608 ద్వారా రూ. 18.21 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఇందులో రూ. 85 లక్షల నిధులు అంతర్గాం డబుల్ బెడ్ రూమ్ కాలనీ వద్ద పనులకు కేటాయించింది.

రూ. 14.15 కోట్లు మిషన్ భగీరథ పనులకు...

నూకపల్లి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కాలనీకి మంచినీటి వసతి పనులు నిర్వహించడానికి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రూ. 14.15 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఆ నిధులతో మిషన్ భగీరథ కార్యక్రమంలో భాగంగా మంచినీటి అభివృద్ధి పనులు చేయనున్నారు. మంచినీటి పైప్‌లైన్లు, బోరింగ్‌ల ఏర్పాటు, ఇతర మంచి నీటి సరాఫరా పనులు పూర్తి చేయడానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మంజూరు చేసిన రూ. 32.36 కోట్ల మిషన్ భగీరథ, మౌలిక వసతుల కల్పన నిధులతో పనులు పూర్తయితే లబ్ధిదారుల కష్టాలు గట్టెక్కుతాయని ఆశిస్తున్నారు.

సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి సమస్యను తీసుకువెళ్లా

డాక్టర్ సంజయ్ కుమార్, ఎమ్మెల్యే, జగిత్యాల

రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌ల దృష్టికి నూకపల్లి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కాలనీ సమస్యను తీసుకవెళ్లాను. దీంతో సీఎం సమస్య పరిష్కారానికి స్పష్టమైన హామీ నిచ్చారు. డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల పథకంపై మంత్రి పొంగులేటి త్వరలోనే జగిత్యాలకు వచ్చి సమీక్ష చేయనున్నారు. వచ్చే దసరా నాటికి ఇళ్ల పనులు సంపూర్ణంగా పూర్తి చేస్తాము.

రూ. 32.36 కోట్లు నిధులు మంజూరు అయ్యాయి: జంగిటి రాజేశ్వర్, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి

నూకపల్లి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కాలనీతో పాటు అంతర్గాం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కాలనీలో అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రూ. 32.36 కోట్ల నిధులను మంజూరు చేసింది. సంబంధిత నిధులతో అవసరమైన పనులు నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నాము. కాలనీలో మౌలిక వసతుల కల్పనతో పాటు మంచినీటి అభివృద్ధి పనులు నిర్వహించనున్నాము.

డబుల్ బెడ్‌రూం ఇళ్లకు మౌలిక సదుపాయాల కల్పన

జగిత్యాల టౌన్: అతి త్వరలోనే డబుల్ బెడ్‌రూం ఇళ్లకు మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు. పట్టణ శివారులో ఉన్న నూకపల్లి హౌజింగ్ కాలనీకి ప్రభుత్వం ఇటీవల రూ. 32 కోట్లు మంజూరు చేయగా అధికారులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే మంగళవారం డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయాన్ని పరిశీలించారు. డ్రైనేజీల నిర్మాణం, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు తదితర మౌలిక వసతుల కల్పనపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేసి మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి పనులు చేసినప్పటికీ రూ. 40 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సీఎం రేవంత్ రెడ్డిని కలిసి పరిస్థితిని వివరించగా నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోళి శ్రీనివాస్, ఈఈలు రహమాన్, శేఖర్‌రెడ్డి, డీఈలు రాజేశ్వర్, మిలింద్, జలందర్, కౌన్సిలర్లు అనీల్ ఉన్నారు.

అంతర్గాంలో రూ. 80 లక్షలు నిధులు మంజూరు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలంలోని అంతర్గాం డబుల్‌బెడ్‌రూం ఇండ్లకు రూ. 80 లక్షల నిధులను రాష్ట్రప్రభుత్వం మంజూరు చేసిందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం జగిత్యాల రూరల్ మండలంలోని అంతర్గాం డబుల్ బెడ్‌రూం ఇండ్లను అధి కారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. డీఈ మిలింద్, ఏఈ రాజమ ల్లయ్య, గ్రామనాయకులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

గడువులోగా ప్రభుత్వ లక్ష్యాలను పూర్తి చేయాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి



వీసీకి హాజరైన కలెక్టర్ సత్య ప్రసాద్, ఇతర అధికారులు

జగిత్యాల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ లక్ష్యాలను నిర్దీత గడువులోగా అధికారులు పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు. మంగళవారం హైద్రాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు జగిత్యాలలో కలెక్టర్ సత్య ప్రసాద్‌తో పాటు పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు. పెండింగ్‌లో ఉన్న అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనులు, మహిళా శక్తి కింద ఆర్థికంగా మహిళలు నిలదొక్కుకునేలా చర్యలు, సీజనల్ వ్యాధుల నియంత్రణ, విద్యార్థులకు యూనిఫాం, పాఠ్య పుస్తకాల పంపిణీ, ఉద్యోగుల బదిలీ ప్రక్రియ, పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిష్కారం తదితర అంశాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ విభాగాలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఆదాయపు పన్ను నుంచి మినహాయించాలి

ప్రధాన మంత్రికి పెన్షనర్ల పోస్టు కార్డులు



పోస్టు డబ్బాలో కార్డులు వేస్తున్న పెన్షనర్లు

జగిత్యాల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పెన్షనర్లను ఆదాయపు పన్ను నుంచి మినహాయించాలని కోరుతూ జగిత్యాలలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి మంగళవారం పలువురు పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు పోస్టు ద్వారా ఉత్తరాలు పంపారు. ఈనెల 23వ తేదీన కేంద్ర బడ్జెట్ లోక్ సభలో ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని అసోసియేషన్ కార్యాలయంలో పెన్షనర్లు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆదాయపు పన్ను పరిమితిని రూ. 15 లక్షలకు పెంచాలని కోరుతూ పోస్టు కార్డులను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి పంపారు. పెన్షనర్ల అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరిఅశోక్ కుమార్, నాయకులు బొల్లం విజయ్, గౌరిశెట్టి విశ్వనాథం, హన్మంత్ రెడ్డి, రాజేశ్వర్, శివానందం, గంగాదర్, గంగారాం, దేవేందర్‌రావు, సయ్యద్, యూసూఫ్, ఎక్బాల్, ప్రసాద్, మధుసూదన్, బీమయ్య, హన్మాండ్లు పాల్గొన్నారు.

చేయూత పథకంలో బీడీ కార్మికులకు లబ్ది కల్పించాలి

కోరుట్ల, జూలై 9 : బీడీ కార్మికులకు ఎలాంటి అంక్షలు లేకుండా చేయూత పథకంలో కార్మికులు లబ్ధిపొందే విధంగా చర్యలు ప్రభుత్వాలు తీసుకోవాలని తెలంగాణ ప్రగతి శీల బీడి వర్కర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చింత భూమేశ్వర్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో బీడి కార్మిక సంఘ భవనంలో ఏర్పాటు చేసిన కార్మిక సంఘ నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రావిడెంట్ ఫండ్ పిన్షన్ పథకం 1995 ప్రకారం కార్మికులకు కనీస పిన్షన్ రూ. 10,000 అందించాలన్నారు. చేయూత పథకంలో కార్మికులు రూ. 4,000 ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీడి కార్మిక సంఘ నాయకులు సూర్య శివాజీ, గంగాధర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించేందుకే ప్రజాదర్బార్



వినతులు స్వీకరిస్తున్న చైర్ పర్సన్, కమిషనర్

జగిత్యాల టౌన్, జూలై 9: ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ప్రజా దర్బార్‌లో పలువురు తమ సమస్యలను వినతుల రూపంలో చైర్ పర్సన్‌కు అందజేశారు. ప్రతి సమస్యను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు చైర్ పర్సన్ ఆదేశాలు జారీ చేశారు. అనంతరం జ్యోతి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సమ్మయ్యతో పాటు వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

డ్రగ్స్,గంజాయి నివారణలో..

యువత భాగస్వాములు కావాలి

- ●గంజాయి రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం
- ●ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల టౌన్, జూలై 9 :డ్రగ్స్, గంజాయి నివారణలో యువత భాగస్వాములు కావాలని ఎస్పీ అశోక్ కుమార్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని చైతన్య జూనియర్ కళాశాలలో మంగళవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే పరిమాణాలు, నష్టాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఎస్పీ అశోక్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు బానాస కాకుండా మంచిగా చదువుకని ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. మత్తు పదార్థాలకు మానసికంగా బానిస కావడం వలన అనుకోకుండా నేరాలు చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. నేరాలకు పాల్పడితే బంగారు భవిష్యత్ నాశనం కావడంతో పాటు ఉద్యోగ అవకావాలు కోల్పోతారన్నారు. చట్టాలు బలంగా ఉన్నాయని నేరం చేసిన తర్వాత బాధపడి లాభం లేదన్నారు. మంచి నడవడికతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించి తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకరావాలని కోరారు. డ్రగ్స్, మత్తు పదార్థాలు, గంజాయిని గుర్తించిన వారు డయల్ 100కు సమాచారం అందించాలని పేర్కొన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో అనేక సైబర్ మోసాలు బాగుగా పెరిగాయని వీటికి దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాల బారిన పడిన వెంటనే ఆలస్యం చేయకుండా 1930ను ఆశ్రయించాలన్నారు. జిల్లాలో డ్రగ్స్ రహిత వాతావరణం నెలకొల్పేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించామన్నారు.



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఎస్పీ

అనంతరం మత్తు పదార్థాల సేవించడం వల్ల కలిగే దుష్పరిమాణాలపై విద్యార్థులకు విడియోల ద్వారా అవగాహన కల్పించారు. డ్రగ్స్ నివారణలో యువత పాత్రపై ఎస్పీ అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ అవగాహన సదస్సులో డీఎస్పీ రఘు చందర్, టౌన్ సీఐ వేణుగోపాల్, కళాశాల ప్రిన్సిపాలః మునిపట్ల రాజేందర్ ఉన్నారు.

గిరిజన తండాల్లో ఘనంగా..

శీత్లా భవాని ఉత్సవాలు

పాల్గొన్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



పెగడపల్లి మండలంలోని తండాలో వేడుకల్లో పాల్గొన్న అడ్లూరి

పెగడపల్లి, జూలై 9 : మండలంలోని గిరిజన తండాలలో మంగళవారం శీత్లా భవాని వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఉత్సవాలలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని నెత్తిన గుడాల పాత్రతో వెళ్లి మొక్కులు చెల్లించారు. అనంతరం నాయకులతో కలసి మొక్క నాటారు. కార్యక్రమాలలో మాజీ సర్పంచ్ రవినాయక్, మాజీ ఎంపీటీసీలు మందపెల్లి అంజయ్య, కొత్తపల్లి రవిందర్, గిరిజన సంఘం నాయకులు బాలునాయక్, జీవన్ నాయక్, బక్కనాయక్ పాల్గొన్నారు.



మెట్‌పల్లి మండలంలోని తండాల్లో పూజలు

కొడిమ్యాల : మండలంలోని గంగారాంతండా గ్రామ పంచాయతీ పరిధిలోని ఏడు లంబాడీ తండాలలో గిరిజన బంజారాలు మంగళవారం శీత్లా భవానీ పండగను ఘనంగా నిర్వహించుకున్నారు. వర్షాలు బాగా కురువాలని, పంటలు పండాలని, తమ కుటుంబాలను భవానీ మాత చల్లంగా చూడాలని కోరుకుంటు పూజలు చేశారు. గ్రామ శివారులో ఏర్పాటు చేసుకున్న దేవతా మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో గంగారాంతండా గ్రామ మాజీ సర్పంచ్ బోజ్యానాయక్, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు సుజాతవినోద్ గ్రామ ప్రముఖులు, రాజేందర్, గంగరాం, శంకర్, తిరుపతి, రాజు, తండాల పెద్ద మనుషులు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని కలికోట గిరిజన తండాలో మంగళవారం సాయంత్రం శీత్లా భవానీ పండగ వేడుకలు గిరిజనులు ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆషాఢమాసం మొదటి మంగళవారం అమ్మవారికి నైవేద్యాలతో పండగను నిర్వహిస్తుంటారు. మహిళలు, యువతులు బోనాలు ఎత్తుకుని నృత్యాలు చేసుకుంటూ అమ్మవారిని ప్రతిష్ఠించిన ప్రదేశానికి వెళ్లి యాటలను బలిచ్చారు.

రాయికల్: మండలంలోని చింతలూరు గ్రామంలో మంగళవారం బంజారాల ఆరాధ్య దైవమైన శీత్లా భవానీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గిరిజనులు పాడి పశువులు బాగుండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో ఉండాలని పూజలు నిర్వహించారు. లంబాడీల ఐక్య వేదిక అధ్యక్షుడు బానోతు రమేష్ నాయక్, జాటోత్ బాపురావు నాయక్, రాజేష్ నాయక్, ఉప సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, రాజు నాయక్, రామ్‌లాల్, మోతీలాల్ పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్: గిరిజన సంప్రదాయ దుస్తువులు ధరించి మండలంలోని పలు గ్రామాల్లోని తండాల్లో శీతల భవాని పండగను ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం మండలంలోని తండాల్లోని ప్రజలు పెద్ద సంఖ్యలో సంప్రదాయ నృత్యాలు చేస్తూ బయలు దేరారు. తండా సమీపంలో కొలవుదీరిన గిరిజనుల ఆరాధ్యదైవాల గద్దె వద్దకు చేరుకుని పూజలు నిర్వహించారు. బెల్లంతో తయారు చేసిన నైవేద్యాలు సమర్పించి పూజలు జరిపి మొక్కులు చెల్లించుకున్నారు. అక్కడే వనభోజనాలు చేశారు.

మల్లాపూర్ : గిరిజనుల ఆరాధ్య దేవం అయిన శీతల భవాని అమ్మవారిని మంగళవారం పలువురు గిరిజనులు, భక్తులు, నాయకులు ప్రత్యేక పూజలు జరిపి నైవేద్యం సమర్పించారు. మల్లాపూర్, సిర్పూర్, తదితర గ్రామాల శివారులోని భవాని అమ్మవారి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గిరిజనలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వంటకాలను నైవేద్యంగా సమర్పించారు. చల్లంగా చూడు తల్లి అంటూ మొక్కులు చెల్లించుకున్నారు.



రాయికల్ మండలంలో పూజలు నిర్వహిస్తున్న బంజారాలు



కలికోటలో సీతాళభవానికి పూజలు చేస్తున్న గిరిజనులు



పోలీస్‌స్టేషన్ ఎదుట మహిళ బైఠాయింపు

రామగిరి, జూలై 9: తనకు న్యాయం చేయాలని ఓ మహిళ మంగళ వారం రామగిరి పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించింది. రామగిరి మండలం బేగంపేట్ గ్రామానికి చెందిన దాసరి శివకుమార్ తనను పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి శారీరకంగా లొంగదీసుకొని మోసం చేశాడని అదే గ్రామానికి చెందిన ముత్యాల కొమలత మే 25న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పాటు తన వద్ద నుంచి డబ్బులు తీసుకొని తిరిగి ఇవ్వడం లేదని ఫిర్యాదులో పేర్కొంది. తాను ఫిర్యాదు చేసి నెల రోజులు గడుస్తున్నా పరారీలోనే ఉన్నాడని తెలిపింది. జూలై 8న గ్రామంలోని మెడికల్ షాప్‌నకు మందుల కోసం వెళ్తుండగా దాసరి శివ తమ్ముడు, చెల్లెలు కేసు విషయంలో రాజీపడాలని, లేదంటే తనను తన పిల్లలని చంపుతానని బెదిరింపులకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేసింది. దాసరి శివ కుటుంబంతో తనకు ప్రాణభయం ఉందని, ఇప్పటికైన పోలీసులు స్పందించాలని శివను అరెస్ట్ చేయాలని పోలీస్ స్టేషన్ ఎదుట రోదిస్తూ బైఠాయించింది. దీంతో మహిళ కానిస్టేబుల్‌లు వచ్చి నిరసన వ్యక్తం చేస్తున్న మహిళను స్టేషన్ ఆవరణలోకి తరలించారు. కాగా ముత్యాల కొమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. బాధిత మహిళకు న్యాయం జరిగే విధంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

యువకులపై కేసు నమోదు

రాయికల్, జూలై 9: మండలంలోని రామాజీపేట గ్రామానికి చెందిన ఇద్దరిపై మంగళవారం కేసు నమోదైంది. వడుకాపురం శ్రీవాత్సవ్‌కు అదే గ్రామానికి చెందిన మాణిక్యం గంగాధర్, పందిరి ప్రమోద్‌లు రాయికల్ పోలీస్‌స్టేషన్ నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి డబ్బులు ఇవ్వమని డిమాండ్ చేశారు. దీంతో శ్రీ వాత్సవ్ మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇరువురు యువకులపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.



బాలికను లైంగికంగా వేధించిన కేసులో

మహిళకు జైలుశిక్ష

జగిత్యాల టౌన్, జూలై 9: బాలికను కిడ్నాప్ చేసి లైంగికంగా లోబర్చుకున్న ఓ మహిళకు ఒక కేసులో 5 సంవత్సరాల కఠిన కారాగార జైలు శిక్షతో పాటు రూ. 10 వేల జరిమానా, మరొక కేసులో మూడేళ్ల కఠిన కారాగార జైలు శిక్షతో పాటు రూ. 5 వేల జరిమానా విధిస్తూ జగిత్యాల కోర్టు ప్రధాన న్యాయమూర్తి నీలిమ మంగళవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం..

కోరుట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ కాలనీకి చెందిన బాలికకు తన ఇంటి పక్కనే నివసిస్తున్న అస్మా అంజూ అనే మహిళతో పరిచయం ఏర్పడింది. బాలికకు సదరు మహిళ మాయమాటలు చెప్పి ఇంట్లో నుంచి బయటకు తీసుకెళ్లింది. అసభ్యకరమైన కార్యకలాపాలతో లైంగికంగా లోబరుచుకుంది. అప్పట్లో ఈ విషయం సంచలనంగా మారగా బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కోరుట్ల పోలీసులు నిందితురాలు అస్మా అంజూపై 2020-21 సంవత్సరంలో పోక్సోతో పాటు వివిధ సెక్షన్ల కింద రెండు కేసులు నమోదు చేశారు.

కేసు దర్యాప్తు చేసిన పోలీసులు నిందితురాలు అస్మా అంజూను కోర్టులో హాజరు పరుచగా అడిషనల్ పీపీ మల్లికార్జున్ కేసు వాదించారు. అప్పటి డీఎస్పీ రాజశేఖర్ రాజుతో పాటు ఎస్సైలు సతీష్, పృథ్వీధర్, రాజ ప్రమీల, రాజు నాయక్‌లతో పాటు కోర్టు డ్యూటీ అధికారులు కిరణ్ కుమార్, రాజు, నీల నాయక్‌లు సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టారు. కేసును విచారించిన న్యాయమూర్తి నీలిమ నిందితు రాలు అస్మా అంజూకు జైలు శిక్షతో పాటు రూ. 15 వేల జరిమానా విధిస్తూ గత జూన్ 26న తీర్పు వెలువరించారు.

ఈ కేసుల్లో తప్ప కుండా శిక్ష పడుతుందని గమనించిన అస్మా అంజూ బెయిల్‌పై బయటి ఉండి విచారణకు రాకుండా శిక్ష పడిన జూన్ 26వ తేదీన కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకుపోయింది. ఈ విషయం తెలుసుకున్న న్యాయమూర్తి నిందితురాలిపై వారెంట్ ఇష్యూ చేయగా మంగళవారం పోలీసులు నిందితురాలు అస్మా అంజూను పట్టుకుని జైలుకు తరలించారు. నిందితురాలికి జైలు శిక్ష పడడంలో కృషి చేసిన పోలీస్ అధికారులను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

గంజాయి కేసులో మరో ఇద్దరు అరెస్టు

మెట్‌పల్లి, జూలై 9: గంజాయి తరలింపు కేసులో మరో ఇద్దరిని అరెస్టు చేసి, వారి నుంచి ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ ఉమా మహేశ్వర్‌రావు తెలిపారు. మంగళవారం మెట్‌పల్లి పోలీసుస్టేషన్‌లో సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సైలు చిరంజీవి, అనిల్‌కుమార్‌లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 6న మండలంలోని మేడిపల్లి శివారులో ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించాడు.

అదే సమయంలో అనుమానాస్పదంగా కోరుట్ల పట్టణానికి చెందిన నలుగురు యువకులు గంజాయి తీసుకొని రెండు ద్విచక్ర వాహనాలపై అక్కడి వచ్చారు. పోలీసులను గమనించి ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై పారిపోగా మరో ఇద్దరు మైనర్లు పట్టుబడ్డారు. అందులో తప్పించుకుని పారిపోయిన విజయ్, ఉదయ్ ఇద్దరి కోసం ఎస్సైలు చిరంజీవి, అనిల్‌కుమార్‌లు గాలిం పు ముమ్మరం చేశారు. మంగళవారం ఇబ్రహీంపట్నం శివారులో అనుమానాస్పందంగా కనిపించడంతో పట్టుకొని విచారించారు. నేరం ఒప్పుకొని మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన మహమ్మద్ అజార్ వద్ద గంజాయి కొనుగోలు చేసి కోరుట్లకు తీసుకొస్తు న్నట్లు తెలిపారు. నాందేడ్‌లో గంజాయి అమ్ముతున్న మహమ్మద్ అజార్‌తో పాటు నలుగురుని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ నిరంజన్‌రెడ్డి ఎస్సైలు చిరంజీవి, అనిల్‌కుమార్‌లతో పాటు సిబ్బందిని అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సీఐ నిరంజన్‌రెడ్డి

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఐదుగురుకి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, జూలై 9: డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ఐదుగురు వ్యక్తులకు కరీంనగర్ మున్సిఫ్‌కోర్టు జడ్జి మంగళవారం జైలు శిక్ష, జరిమానా విధించారని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. ఇటీవల తనిఖీల్లో పట్టుబడిన 23 మందిని కోర్టులో హాజరు పరచగా అందులో ఇద్దరు వ్యక్తులకు ఐదు రోజుల జైలు శిక్ష, ముగ్గురికి మూడు రోజుల జైలు శిక్ష, మొత్తం 11వేల రూపాయల జరిమానా విధించారని తెలిపారు. మిగతా 18 మందికి 27 వేల రూపాయలు జరిమానా విధించి నట్లు పేర్కొన్నారు. ఇందులో ఒక మైనర్‌కు 2,500 రూపాయలు జరిమా నా విధించినట్లు తెలిపారు.

వైద్యుడిని దూషించిన వ్యక్తిపై కేసు

కరీంనగర్ క్రైం, జూలై 9: వైద్యుడిని దూషించి, దాడి చేసేందుకు ప్రయత్నించిన వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. కరీంనగర్ శివారులోని చల్మెడ ఆసుపత్రిలో పీజీ చదువుతూ డ్యూటీ డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న బానోతు రవి కుమార్ అనే వైద్యుడి విధులను ఆటంకపరచి దూషించి, దాడి చేసేందుకు యత్నించిన శ్యామ్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. ఈనెల 7న సాయంత్రం శ్యామ్ అనే వ్యక్తి ఆసుపత్రిలోని అత్యవసర విభాగంలోకి వచ్చి తనకు చికిత్స చేయాలంటూ అక్కడ విధుల్లో ఉన్న వైద్యుడిని దూషించి, గ్లాస్ డోర్‌ను పగుల గొట్టాడని బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.





అంధుల గురుకుల పాఠశాలలో

విద్యార్థి మృతి

ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంతోనే మృతి చెందాడని తండ్రి ఫిర్యాదు



శ్రీవత్సవ్(ఫైల్)

కరీంనగర్ క్రైం, జూలై 9: కొత్తపల్లి మండలం రేకుర్తి పరిధిలోని ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో మంగళవారం దామ శ్రీవత్సవ్(13) అనే విద్యార్థి టవల్ మెడకు చుట్టుకుని మృతి చెందాడు. పాఠశాల ప్రిన్సిపాల్ మంగళవారం మధ్యాహ్నం విద్యార్థి తండ్రికి ఫోన్ చేసి మీ కొడుకు శ్రీవత్సవ్ వాంతులు చేసుకుంటున్నాడు, జ్వరం వచ్చినట్లుంది తొందరగా రావాలని చెప్పినట్లు శ్రీవాత్సవ్ తండ్రి దామ సది తెలిపారు. మళ్లీ ప్రిన్సిపాల్ ఫోన్ చేసి కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించినట్లు చెప్పాడని, తాము వెళ్లి చూసే సరికి శ్రీవత్సవ్ మరణించి ఉన్నాడని చెప్పారు. పాఠశాలలోని సీసీ కెమెరా ఫుటేజీలను తాము కూడా పరిశీలించామని, శ్రీవత్సవ్ మధ్యాహ్నం దండానికి ఉన్న టవల్‌ను మెడకు చుట్టుకుని ఆడుతూ ఒక్కసారిగా ఆగిపోయినట్లు ఉందన్నాడు. శ్రీవత్సవ్ మృతికి పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని దామ సది పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పెద్దపల్లి జిల్లా ఎలిగేడ్ మండలం ముప్పిరి తోటకు చెందిన దామ శ్రీవత్సవ్‌కు పుట్టుకతోనే ఒక కన్ను కనిపించదు. దీంతో తల్లిదండ్రులు అతడిని ఆరేళ్ల క్రితం రేకుర్తిలోని అంధుల పాఠశాలలో చేర్పించాడు. ప్రస్తుతం శ్రీవత్సవ్ ఏడో తరగతి చదువుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి

మెట్‌పల్లి రూరల్, జూలై, 9 : మండలంలోని మేడిపల్లి గ్రామానికి చెందిన నరేందర్(45)అతిగా మద్యం తాగి పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్ సమీపంలో మంగళవారం మృతి చెందాడు. మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం..మేడిపల్లి గ్రామానికి చెందిన నరేందర్ పాత సామాన్లు వస్తువులు ఏరుకుంటూ వచ్చిన డబ్బులతో మద్యం సేవించేవాడు. మద్యానికి బానిసై నరేందర్ అతిగా తాగి మత్తులోనే పాత సామాన్ల కోసం మెట్‌పల్లిలోని ఓ ఫంక్షన్ హాల్ సమీపంలో పడిపోయాడు. ఎంతకు అతనిలో ఎలాంటి కదలిక లేకపోవడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి గమనించి అతడు మృతి చెందినట్లు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



కరీంనగర్ క్రైం, జూలై 9: కరీంనగర్ సాయినగర్‌లోని సాయి బాబా గుడి వద్ద భిక్షాటన చేస్తున్న గుర్తుతెలియని వ్యక్తి (50) మంగళవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో మూర్ఛ వ్యాధితో మరణించాడని ప్రభుత్వ ఆసుపత్రిలో అవుట్‌పోస్ట్ హెడ్ కానిస్టేబుల్ కె.రవిందర్ తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ గదిలో భద్రపరిచామని తెలిపారు. మృతుడిని గుర్తించిన వారు కరీంనగర్ రెండో టౌన్ సీఐ 8712670762, హెడ్ కానిస్టేబుల్ రవీందర్ 9491481433 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

రెస్టారెంట్‌లో అధికారుల తనిఖీలు

శుభ్రంగా లేకపోవడంతో రూ.35వేల జరిమానా


రెస్టారెంట్‌లో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

కోల్‌సిటీ, జూలై 9: పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రామగుండం నగరపాలక సంస్థ హెల్త్‌అసిస్టెంట్లు మంగళవారం గోదావరిఖని కవిత థియేటర్ సమీపంలోని సాఫ్రాన్ మండి హౌస్‌లో తనిఖీలు జరిపారు. సరైన పరిశుభ్రత పాటించకుండా నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను గుర్తించినట్లు కిరణ్, వైకుంఠం పేర్కొన్నారు. రెస్టారెంట్ యజమానులకు రూ.30వేల జరిమానా విధించా మన్నారు. ఈ ఆహార పదార్థాలను తిరిగి వినియోగించకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. దాడుల్లో ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ మధుకర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వాస్తు దోషం

● మార్పులు, చేర్పులు ప్రారంభం
● తమకు సంబంధం లేదంటున్న ఆర్అండ్బీ అధికారులు
● ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి సొంత నిధులతో పనులు

హుజూరాబాద్, జూలై 9: హుజూరాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వాస్తు దోషం ఉందని మంగళవారం మరమ్మతులు ప్రారంభించారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి తన సొంత ఖర్చులతోనే మరమ్మతులు చేయిస్తుండడం చర్చనీయాంశంగా మారింది. ఈ క్యాంపు కార్యాలయానికి వాస్తు బాగా లేకపోవడం వలనే అపశృతు లు చోటు చేసుకుంటున్నాయనే ఉద్దేశ్యంతో పోర్టికో, కిటికీలు, తలుపు లు తొలగిస్తున్నారని ప్రచారం సాగుతోంది. గతంలో హుజూరాబాద్ నుంచి ఏడుసార్లు గెలిచి, తెలంగాణ ఉద్యమం, ప్రత్యేక రాష్ట్రం వచ్చిన ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన ఈటల రాజేందర్ ఈ క్యాంపు కార్యాలయానికి వెళ్లిన తర్వాతనే ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొన్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ భవనం పనులు 2019లో ప్రారంభించి 2020లో పూర్తి చేశారు. ఈ కార్యాలయంలోకి వెళ్లిన తర్వాత ఈటల రాజేందర్ మంత్రి పదవి నుంచి బర్తరఫ్ అయ్యారు. అనంతర పరిణామాలతో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. తరువాత జరిగిన ఉప ఎన్నికలో బీజేపీ నుంచి పోటీ చేసి గెలిచినా ప్రతిపక్షంలో ఉండడంతో ఆయనకు నియోజకవర్గంలో ఎలాంటి ప్రాధాన్యం లభించలేదు. ఆ సమయంలో ఎమ్మెల్సీగా ఉన్న పాడి కౌశిక్‌రెడ్డి అన్నీ తానై వ్యవహరించేవాడు. ఆ సమయంలో ఈటల రాజేందర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ఉపయోగించేవారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన ఈటల రాజేందర్ ఓడిపోయారు. ఈటలకు కంచుకోటగా ఉన్న హుజూరాబాద్‌లో ఆయన ఓడిపోవడంతో అందరూ ఆశ్చర్యపోయారు. ఇదంతా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వాస్తు దోషం ఉండడం వల్లే జరిగిందని ప్రచారం జరిగింది. దీంతో ఎన్నికల్లో గెలిచి ఆరు నెలలైనా ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వైపు కన్నెత్తి చూడలేదు. నాలుగు రోజుల క్రితం ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి వాస్తు పండితులను తీసుకొచ్చి చూపించడంతో వారు పలు సూచనలు చేశారు. దానికి తగ్గట్లు పనులు ప్రారంభించారు.. ఈ విషయంపై ఆర్అండ్బీ డీఈని వివరణ కోరగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరుగుతున్న పనులకు తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు.


హుజూరాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొనసాగుతున్న పనులు

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద

● ప్రాజెక్టులోకి 3,275 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. మంగళవారం వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 3,275 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 12.208 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 16.824 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 479 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 6.258 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

నల్లగొండ ఆలయంలో దొంగతనం

కొడిమ్యాల, జూలై 9: మండలంలోని నల్లగొండ శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో సోమవారం అర్ధరాత్రి దాటిన తరువాత చోరీ జరిగింది. ఆలయ సిబ్బంది గర్భ గుడి తాళాలు పగిలి ఉండటం గమనించి మంగళవారం ఉదయం ఎస్సై సందీప్‌కు సమాచారం అందించడంతో సిబ్బందితో అక్కడకు చేరుకున్న ఎస్సై డాగ్ స్క్వాడ్‌తో పరిశీలించారు. గుర్తుతెలియని వ్యక్తులు గుడి తాళాలు పగులగొట్టి నర్సింహస్వామి విగ్రహంపై ఉన్న విలువైన 5.3 తులాల బంగారు ఆభరణాలు పుస్తెలు, కాసులహారం ఎత్తుకు పోయినట్లు గుర్తించారు. ఆలయ ఈవో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఆలయంలోని ఉత్సవ మూర్తులపై ఉన్న వెండి ఆభరణాలను వదిలి పోయినట్లు సిబ్బంది తెలిపారు. కొడిమ్యాల ఎస్సై ఆధ్వర్యంలో పోలీసులు ఆలయ సిబ్బందిని, పలువురు భక్తులను విచారించారు.

రేషన్ బియ్యం పట్టివేత


రేషన్ బియ్యం పట్టుకున్న అధికారులు

సుల్తానాబాద్, జూలై 9: సుల్తానాబాద్ మండలంలోని ఐతరాజ్‌పల్లి గ్రామంలో అక్రమంగా నిలువ చేసి ఉంచిన 22 క్వింటాళ్ల రేషన్ బియ్యంను పట్టుకున్నట్లు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్ సుల్తానాబాద్ మండలంలో పలు గ్రామాలలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందితో కలసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐతరాజ్‌పల్లి గ్రామంలో యార్ల మల్లయ్య ఇంటి వద్ద ఆటోలో తరలించడానికి సిద్ధంగా ఉన్న 22 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నామని ప్రేమ్‌కుమార్ వివరించారు. ఇట్టి బియ్యాన్ని పెద్దపల్లి ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించామని అన్నారు. యార్ల మల్లయ్యపై పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

● తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం పాపయ్యపల్లె గ్రామంలో పీడీఎస్ బియ్యం పట్టుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. మంగళవారం ఉదయం ఆటోలో పీడీఎస్ బియ్యం తరలిస్తున్నారనే సమాచారంతో దాడులు చేశామన్నారు. ఆరు క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని, బద్దెనపల్లికి చెందిన మోతె విజయ్‌ను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. విజయ్‌ను విచారించగా గ్రామాల్లో పీడీఎస్ బియ్యాన్ని సేకరించి సిద్ధిపేట జిల్లా చిన్నకోడూరు మండలం రామంచ గ్రామానికి చెందిన నరేష్‌కు విక్రయిస్తున్నట్లు తెలిపాడన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

● జగిత్యాల టౌన్: రెండు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మంగళవారం టౌన్ ఎస్సై మన్మథరావు ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. పట్టణంలోని మంచినీళ్ల బావి ప్రాంతం నుంచి షేక్ అంజద్ అనే వ్యక్తి రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేసి బియ్యాన్ని సీజ్ చేసినట్లు ఎస్సై వివరించారు.

ఘనంగా జగన్నాథ రథోత్సవం


కోరుట్లలో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కోరుట్ల, జూలై 9: హరే రామ... హరే కృష్ణ నామస్మరణతో కోరుట్ల పట్టణం మారుమోగింది. మంగళవారం పెద్దపూర్ ఇస్కాన్ దేవాలయ ఆధ్వర్యంలో కోరుట్ల పట్టణంలో జగన్నాథ రథోత్సవం ఘనంగా సాగింది. పట్టణంలోని వేంకటేశ్వర, నగేశ్వర దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఇస్కాన్ దేవాలయ నిర్వాహకులు భక్తులు రథోత్సవం ప్రారంభించారు. రథోత్సవం వేంకటేశ్వర దేవాలయం నుంచి ఐబీ రోడ్డు నంది, కార్గిల్, అంబేడ్కర్ చౌరస్తాల మీది జాతీయ రహదారిపై కొనసాగింది. ఈ సందర్భంగా భక్తులు హరే రామ హరే కృష్ణ నామస్మరణతో భజనలతో నృత్యాలు చేస్తూ రథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు రహదారులను నీటితో శుభ్రం చేయగా ఇస్కాన్ భక్తులు రోడ్లపై రంగవళ్లులు వేస్తూ స్వాగతం పలికారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు సురభి నవీన్ కుమార్ రథోత్సవంలో పాల్గొన్న భక్తులతో కలిసి నృత్యాలను చేశారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ దేవాలయ నిర్వాహకులు పాల్గొన్నారు. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా కోరుట్ల సిఐ సురేష్ బాబు ఆధ్వర్యంలో ఎస్ఐ కిరణ్ కుమార్ తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

శంకరపట్నం, జూలై 9: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్ మండలం గట్టుదుద్దెనపల్లి గ్రామానికి చెందిన కాశక రఘువరణ్ (44) అనే వ్యక్తి ఈ నెల 7న అతని బావమరిది పొరముళ్ల శ్రీనివాస్‌తో కలిసి బైక్‌పైన శంకరపట్నం మండలం లింగాపూర్‌లోని బంధువుల ఫంక్షన్‌కు వెళ్తున్నారు. అత్యవసర పనుల నిమిత్తం మెట్‌పల్లి గ్రామానికి వెళ్తుండగా శ్రీలక్ష్మీనర్సింహస్వామి రైస్‌మిల్ వద్దకు చేరుకోగానే టిప్పర్ డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుకుంటూ వచ్చి బైక్‌ను ఢీ కొట్టాడు. బైక్ పైనుంచి ఇద్దరు కింద పడగా, కాశక రాఘువరణ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వరంగల్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

టీజీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ ఏజెంట్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి టౌన్, జూలై 9: టీజీఎస్ఆర్టీసీ కరీంనగర్ రీజియన్ పరిధిలో గల జిల్లా కేంద్రాల్లో, పట్టణ, మండల కేంద్రాల్లో టీజీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్స్ ఏజెంట్ల కొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని కరీంనగర్ లాజిస్టిక్స్ ఏటీఎం ఎస్ సదాశివ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రాలలో ఏజెంట్ కొరకు 5,000 రూపాయలు, మండల కేంద్రాల్లో 1000 రూపాయలు డీడీల రూపంలో చెల్లించాలని పేర్కొన్నారు. ఆసక్తిగల వాళ్లు కరీంనగర్, గోదావరిఖని, పెద్దపల్లి, హుజురాబాద్ సంబంధిత మండలాల వాళ్లు సేల్స్ టీం లీడర్ రాజు 9154298581ను, జగిత్యాల జిల్లాలోని మండలాల వారు రమేష్ 9154298572ను, సిరిసిల్ల జిల్లాలోని వాళ్లు శేఖర్ రావు 9154298576ను, హుస్నాబాద్ పరిధిలోని మండలాల వాళ్లు సురేష్ 9154298673ను సంప్రదించగలరని ఏటీఎం తెలిపారు. దీనికి గడువు తేదీ లేదని, ఆసక్తిగల వాళ్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

యువతి ఆత్మహత్య

వెల్గటూర్, జూలై 9: మండలంలోని శాఖాపూర్ గ్రామానికి చెందిన రంగం పూజిత (19) అనే యువతి మంగళవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. మృతురాలు పూజిత ఇంటర్మీడియట్ పూర్తి చేసింది. డిగ్రీ మొదటి సంవత్సరం కరీంనగర్‌లోని ఓ కళాశాలలో చేరింది. అక్కడ తనతో చదివిన స్నేహితులు ఎవరూ లేరని కుటుంబీకులకు చెప్పి బాధపడింది. మంగళవారం తల్లి కూరగాయలు అమ్మడానికి ధర్మారం వెళ్లింది. తమ్ముడు చదువుకోవడానికి పాఠశాలకు వెళ్లాడు. ఎవరూ లేని సమయంలో ఇంటిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. తండ్రి జీవనోపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లాడు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

మెట్‌పల్లి రూరల్, జూలై 9: మండలంలోని చౌలమద్ది గ్రామానికి చెందిన గొట్టిపడుత శంకర్‌గౌడ్(67)అనే వృద్ధుడు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శంకర్‌గౌడ్ ఈ నెల 2న ఆరపేట ఎక్స్ రోడ్డు సమీపంలో ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడ్డాడు. హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్న శంకర్‌గౌడ్ మంగళవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు అన్న గొట్టిపడుత గంగారం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, జూలై 9: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి బస్టాండు ప్రాంతంలోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గొల్లపల్లికి చెందిన కిష్టస్వామిగౌడ్ తీవ్ర గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కిష్టస్వామిగౌడ్ తన స్కూటీపై గొల్లపల్లి బస్టాండు ప్రాంతంలో యూటర్న్ తీసుకుంటున్నాడు. ఈ క్రమంలో మండలంలోని బుగ్గరాజేశ్వరతండాకు చెందిన యువకుడు రాజేందర్ బైక్‌తో అతివేగంగా ఢీకొట్టాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సెప్టిక్ ట్యాంకులో పడిన బాలుడు

● పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఘటన ● బాలుడి పరిస్థితి విషమం


బాలుడిని అంబులెన్స్‌లో కరీంనగర్‌కు తరలిస్తున్న సిబ్బంది


పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో మూత తీసి ఉన్న సెప్టిక్ ట్యాంక్

పెద్దపల్లి టౌన్, జూలై 9: పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఓ బాలుడి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. ఆసుపత్రి ఆవరణలోని సెప్టిట్ ట్యాంక్ మూత తెరిచి ఉంచడంతో మంగళవారం ఉదయం తొమ్మిదేళ్ల బాలుడు అందులో పడిపోయాడు. అతడి పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం సూదనపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్, రాములమ్మ దంపతులు కూలీ పనుల కోసం పెద్దపల్లికి వచ్చారు. సోమవారం శ్రీనివాస్‌కు జ్వరం రావడంతో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వారితో పాటు వారి తొమ్మిదేళ్ల కుమారుడు విలియమ్స్ ఆసుపత్రిలోనే ఉన్నాడు. మంగళవారం ఉదయం టాయిలెట్ కోసం ఆసుపత్రి ఆవరణలోని సెప్టిక్ ట్యాంక్ గల ప్రదేశానికి వెళ్లాడు. ట్యాంక్ మూత తెరిచి ఉండడంతో విలియమ్స్ ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. ఈ విషయాన్ని గమనించిన తల్లి కేకలు వేయడంతో ఆసుపత్రి సిబ్బంది అక్కడకు చేరుకొని బాలుడిని బయటకు తీశారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రథమ చికిత్స అనంతరం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్‌లో వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. ఈ విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్ రమాకాంత్‌ను వివరణ కోరగా, సెప్టిక్ ట్యాంకుపై మూత తెరిచి ఉన్న కారణంగానే బాలుడు అందులో పడ్డాడని తెలిపారు. ఈ ఘటనపై విచారణ జరుపుతున్నామని వివరించారు.

ప్రమాదకరంగా బాలుడి పరిస్థితి

సుభాష్‌నగర్: పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలోని సెప్టింక్ ట్యాంకులో పడిన బాలుడు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. ట్యాంకులో పడిన బాలుడిని సకాలంలో గుర్తించక పోవడం, నీళ్ల ఎక్కువగా తాగడం వల్ల ప్రస్తుతం కోమా స్థితిలో ఉన్నాడని, 48 గంటలు గడిస్తే కానీ ఏమీ చెప్పలేమని డాక్టర్లు తెలిపారు.

భారతదేశానికి రక్షణ కవచం ప్రధాని మోదీ

● కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సజయ్ కుమార్

వేములవాడ టౌన్, జూలై 9 : దేశంలో గోకుల్ బాంబు బ్లాస్టులు లేవని, లుబిని పార్క్‌లాంటి బ్లాస్టులు, టెర్రరిస్టుల అలజడి దేశంలో ఎక్కడ కనబడుతలేవంటే కేవలం ప్రధాని నరేంద్ర మోదీ దేశానికి రక్షణ కవచంలా నిలుస్తున్నాడని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సజయ్ కుమార్ అన్నారు. వేములవాడ పట్టణంలో మున్నూరు కాపు సంఘం భవన నిర్మాణ భూమిపూజ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని వేములవాడ, కొండగట్టు, ఇల్లందకుంట ఆలయాలను అభివృద్ధి చేసి తీరుతానని హామీచ్చారు. ఆయా ఆలయాల అభివృద్ధిపై కేంద్ర మంత్రి గజేంద్ర షెకావత్‌ను కలిశామన్నారు. అవసరమైతే కేంద్ర మంత్రిని వేములవాడకు తీసుకు వచ్చేందుకు కృషి చేసి అన్ని విధాల అభివృద్ధి చేస్తానని అన్నారు. మున్నూరు కాపు సంఘం భవన నిర్మాణానికి శంఖుస్థాపన చేయడం సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. మీరంతా కష్టపడి పని చేసినందుకే మంత్రిని అయ్యాయనని, నా గెలుపునకు కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు కూడా సహకరించారని అన్నారు. నాకు భారీ మెజార్టీ అందించిన ఈ ప్రాంత ప్రజల అభివృద్ధి కోసం పని చేస్తానని, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి పనిచేస్తానని అన్నారు. అనంతరం పట్టణం బీజేపి పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా భీమేశ్వర గార్డెన్‌కు వీచ్చేసిన ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ మీరు తయారు చేసిన కార్యకర్తను అని, కింది స్థాయి నుంచి ఎదిగిన వ్యక్తిని అని, కష్టమొచ్చిన కార్యకర్తలకు అండగా ఉంటానని కార్యకర్తలను ఉత్తేజపరిచారు. దేశంలో మోదీ ప్రభుత్వం లేకుంటే 370 ఆర్టికల్ రద్దు చేసే సాహసం ఎవరూ చేసేవాళ్లు కాదన్నారు. మొన్నటి వరకు పార్లమెంట్ చేసే చట్టాలు జమ్మూ కాశ్మీర్‌కు వర్తించేవి కాదని, 370 ఆర్టికల్ రద్దుతో భారతీయ జెండా సగర్వంగా ఎగురుతుందని ఉద్వేగభరితంగా చెప్పారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమమే బీజేపీ ధ్యేయం అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, నియోజకవర్గ ఇంచార్జ్ చెన్నమనేని వికాస్‌రావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రం మహేష్, అల్లాడి రమేష్, దళితమోర్చ జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్, మాజీ ఎంపీపీ బండ మల్లేశం యాదవ్, నాయకులు రేగుల మల్లికార్జున్, జక్కుల తిరుపతి తదితరులు ఉన్నారు.


మున్నూరుకాపు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న బండి సంజయ్

ఆలయాల్లో ఘనంగా ఆషాఢమాస పూజలు


మానసాదేవి ఆలయంలో కుంకుమ పూజలు


మెట్‌పల్లి పెద్దమ్మ ఆలయంలో కుంకుమ పూజలు

గన్నేరువరం, జులై 9: మండలంలోని ఖాసింపేట మానసాదేవి ఆలయానికి ఆషాఢమాస శోభ సంతరించుకుంది. స్వయంభువుగా వెలసిన మానసాదేవి ఆలయంలో ఆషాఢమాసం మొదటి మంగళవారం భక్తులతో కిక్కిరిసిపోయింది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారి ఉత్సవ విగ్రహానికి క్షీరాభిషేకం, కుంకుమ పూజలు చేశారు. కోరిన కోర్కెలు తీర్చాలని ముడుపులు కట్టి, ఒడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ ఛైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, ప్రధాన అర్చకులు అమర్‌నాథ్ శర్మ, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

● మెట్‌పల్లి: పట్టణంలోని బంగారు పెద్దమ్మ తల్లి ఆలయంలో కల్యాణ కాత్యాయనీ దేవి వ్రతాన్ని ఘనంగా జరిపించారు. మంగళవారం ఆలయంలో బంగారు తల్లి అమ్మవారికి, శ్రీవల్లి దేవి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో అభిషేకాలు, లక్ష్మీదేవి పూజలను ఆలయ పురోహితుడు మదన్‌శర్మ జరిపారు. అనంతరం భక్తులు ఆలయం సమీపంలోని శ్రీ ఐశ్వర్యలక్ష్మి గోశాలలోని గోమాతలకు మహిళలు, భక్తులు ప్రత్యేక పూజలు జరిపి వాటికి ఆహారం అందజేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు పురోహితులు తీర్థ ప్రసాదం అందజేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలి

గన్నేరువరం, జులై 9ః కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మండల ప్రజాసంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహశీల్దారు కార్యాలయంలో తహశీల్దారు భిక్షపతికి మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల కన్వీనర్, గొర్రెలు మేకల పెంపకందారుల సంఘం జిల్లా కార్యదర్శి కాల్వ సురేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సుంకరి సంపత్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో అనేక హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిందని అన్నారు. హామీలలో భాగంగా మహాలక్ష్మి పథకంలో 18 సంవత్సరాల నుంచి ప్రతి మహిళకు నెలకు 2,500 ఇవ్వాలని అన్నారు. ఖరీఫ్ సీజన్‌లో అన్నదాతకు రైతుభరోసా సాయం 7,500 అందించాలని, వ్యవసాయ కూలీలకు 12000, కౌలు రైతులకు 15000, ప్రతి రైతుకు రెండు లక్షల రుణమాఫీ అందించాలని డిమాండ్ చేశారు. ఇంటి స్థలం లేనివారికి 200 గజాల స్థలాన్ని కేటాయించి ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం 5లక్షలను, కేంద్ర ప్రభుత్వం పది లక్షలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గొర్రెలు మేకల పెంపకందారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జీల ఎల్లయ్య, మండల నాయకులు పాశం వేణు, శ్రీనివాస్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించడం లేదని పంచాయతీ కార్యాలయానికి తాళం



తాళం వేసి ఉన్న రాంసాగర్ పంచాయతీ భవనం

కొడిమ్యాల, జూలై 9 : ప్రభుత్వం నుంచి తనకు రావాల్సిన బిల్లులు చెల్లించడం లేదని జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని రాంసాగర్ గ్రామ పంచాయతీ భవనానికి కాంట్రాక్టర్ నీలగిరి గంగారావు మంగళవారం తాళం వేశాడు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్ మాట్లాడుతూ గ్రామంలో రూ. 20లక్షలతో గ్రామ పంచాయతీ భవనం నిర్మించినట్లు తెలిపాడు. 2024 ఫిబ్రవరిలో భవన నిర్మాణం పూర్తి చేసి అప్పగించానన్నారు. ఇప్పటి వరకు తనకు రావాల్సిన డబ్బులు అందలేదన్నాడు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ప్రభుత్వం నుంచి వచ్చిన తర్వాత చెల్లిస్తాం అంటున్నారే తప్ప బిల్లులు మాత్రం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ కారణంగా కార్యాలయానికి మంగళవారం తాళం వేశానని కాంట్రాక్టర్ గంగారావు తెలిపాడు. ఈ విషయమై ఎంపీవో వాసవిని వివరణ కోరగా ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతోనే చెల్లింపుల్లో జాప్యం జరుగుతోందని తెలిపారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బిల్లులు త్వరలో చెల్లించేలా చూస్తామని కాంట్రాక్టర్‌కు హామీ ఇవ్వడంతో బుధవారం తాళం తీస్తానని చెప్పారని తెలిపారు.

దొంగ అరెస్ట్

పెద్దపల్లి టౌన్, జూలై 9 : పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో మే 28న హుండీ పగులగొట్టి డబ్బులు ఎత్తుకెళ్లిన దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెన్నెల మండలం, మైలారం గ్రామానికి చెందిన కంపెల శ్రీనివాస్ గతంలో నెన్నల్, రెబ్బనలోని ఆలయాల్లో దొంగతనం చేయగా కేసులు నమోదు కావడంతో ఏడాది కాలం జైలుకు వెళ్లాడు. గత ఐదేళ్లుగా పెద్దపల్లి పట్టణంలోని తిలక్‌నగర్‌లో ఉంటూ సెంట్రింగ్ పనిచేసుకుంటూ జీవిస్తున్నాడని అన్నారు. జల్సాలకోసం తిరిగి అయ్యప్ప ఆలయంలో దొంగతనం చేశాడని , అతన్ని సీసీ కెమెరాల ద్వారా గుర్తించి పెద్దపల్లి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా దొంగను గుర్తించి అతని వద్ద రూ.4370లను రికవరీ చేసినట్లు తెలిపారు. దొంగను పట్టుకోవడంతో పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణ్‌రావు, మల్లేశంతో పాటు సిబ్బందిని అభినందించారు.

అలంకారప్రాయంగా క్రీడా ప్రాంగణాలు

● లక్షలు వెచ్చించినా నెరవేరని లక్ష్యం

మానకొండూర్, జూలై 9: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించి నైపుణ్యం గల క్రీడాకారులను తయారు చేయాలనే ఉద్దేశ్యం లక్షల రూపాయలను వెచ్చించి తెలంగాణ క్రీడా ప్రాంగణాలను నెలకొల్పాడు. గ్రామాల్లోని ప్రభుత్వ స్థలాలతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. మండలంలో 27 గ్రామపంచాయితీలుండగా నిజాయితీగూడెంలో స్థలం లేక అక్కడ క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయలేదు. మిగతా 26 గ్రామాలలో ఒక్కొక్క దానికి రూ. 2లక్షల ఎస్టిమేషన్ ఉన్నప్పటికీ లక్ష రూపాయల వరకే చెల్లింపులు జరిగాయి. ఈ క్రీడా ప్రాంగణంలో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ కోర్టు, ఆర్చీల నిర్మాణం ఎంతో ఆర్భాటంగా పూర్తి చేశారు. రంగపేట క్రీడా ప్రాంగణం గ్రామానికి సుమారు 4కిలోమీటర్ల దూరంలో యువకులకు ఉపయోగపడకుండా ఉంది. ప్రతి గ్రామానికి 16 రకాల ఆట వస్తువుల కిట్టును అధికారులు పంపిణీ చేశారు. పంపిణీ చేసిన కిట్లు మూలన పడడంతో యువత క్రీడా ప్రాంగణాలను దూరం అయ్యారు. దీంతో క్రీడా ప్రాంగణాలు అలంకార ప్రాయంగా దర్శణమిస్తున్నాయి.


నిరుపయోగంగా ఉన్న రంగపేట క్రీడాప్రాంగణం

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

రాయికల్, జూలై 9: వర్షాకాలం సమీపించినందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ చిరంజీవి అన్నారు. రాయికల్‌లోని అన్ని వార్డుల్లో మంగళవారం డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మురికి కాలువలు శుభ్రం చేయడం, నీరు నిలిచిన ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడం, ఇళ్లల్లో ఉన్న మంచినీటి బావు ల్లో బ్లీచింగ్ పౌడర్ వేయడం, మురుగు నీరు నిలిచిన చోట దోమల వృద్ధిని అరి కట్టేందుకు అయిల్ బాల్స్ వేయడం వంటి కార్యక్రమాలు చేశారు. ఈ సందర్భంగా ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ మెంబర్లు పాల్గొన్నారు.

'కమిటీల పేరుతో కాంగ్రెస్ కాలయాపన'

జగిత్యాలరూరల్, జూలై 9 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కమిటీల పేరుతో కాలయాపన చేస్తోందని బీజేపీ కిసాన్‌మోర్చ తీవ్రంగా ఖండించింది. రాష్ట్ర కిసాన్‌మోర్చ ఆదేశాల మేరకు మంగళవారం బీజేపీ కిసాన్‌మోర్చ ఆధ్వర్యంలో రూరల్ తహ సీల్దార్ రాంమోహన్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రెండు లక్షల రుణమాఫీని బేషరతుగా మాఫీ చేయాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోకు కట్టుబడి రైతుభరోసా పేరుతో ప్రతి ఎకరాకు ఖరీఫ్, రబీ కలుపుకొని రూ. 15వేల ఆర్థిక తోడ్పాటునందించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ప్రధాన మంత్రి పంటల బీమా అమలు తోపాటుగా వ్యవసాయకూలీలకు సంవత్సరానికి 12 వేలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌మోర్చరూరల్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, పట్టణ అధ్యక్షుడు రాము, నాయకులు గంగారెడ్డి, విజయ్, ఆదిత్య, ప్రవీణ్ పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలని తహసీల్దార్‌కు వినతి

రాయికల్, జూలై 9: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ బీజేపీ కిసాన్ మోర్చా మండల శాఖ నాయకులు మంగళవారం తహసీల్దార్ ఖయ్యూంకు వినతి పత్రం సమర్పించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 200 రోజులు పూర్తయినా రైతులకు ఇస్తానన్న రైతు భరోసా, ఖరీఫ్, రబీ కలుపుకుని రూ.15 వేలు, రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీ, కౌలు రైతులకు రూ.12 వేల పెట్టుబడి సాయం పూర్తి స్థాయిలో రైతులకు అందజేయాలన్నారు. అలాగే ప్రధాన మంత్రి పంట బీమా యోజన పథకాన్ని తెలంగాణలో అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుర్మ మల్లారెడ్డి, ప్రేమ్ రెడ్డి, సంజీవ్ రెడ్డి, సంజీవ్, కిరణ్ రెడ్డి, సుధాకర్, గంగరాజం, రైతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్త పడాలి

కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి నర్సింగరావు

మెట్‌పల్లి, జూలై, 9: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజక వర్గం ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు కోరారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వానాకాలంలో మలేరియా, పైలేరియా, అతిసారా, మెదడువాపు, డెంగీ, చికెన్ గున్యా, టైఫాయిడ్, డయేరియా వంటి వ్యాధులు ప్రజలే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులను అరికట్టవచ్చన్నారు. వర్షపు నీరు నిల్వ ఉన్న చోట తొలగించి ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. ఎక్కువ నీటి నిల్వలు ఉన్న ప్రాంతాలలో మలేరియా వ్యాధిని వ్యాప్తి చెందించే దోమలు పెరుగుతా యన్నారు. మురుగు కాలువలను శుభ్రం చేయాలని, ప్లాస్టిక్‌ను నిరోధించాలని, బ్లీచింగ్, ఫాగింగ్ చేపట్టాలని చెప్పారు. ప్రతి శుక్రవారం డ్రై డేను తప్పకుండా చేపట్టాలన్నారు.

జడ్పీ మాజీ చైర్‌పర్సన్‌ను సన్మానించిన మాజీ మంత్రి కొప్పుల



జడ్పీ మాజీ చైర్‌పర్సన్‌ను సన్మానిస్తున్న మాజీ మంత్రి కొప్పుల దంపతులు

జగిత్యాల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అయిదేళ్ల పదవీ కాలన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్ దంపతులను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ స్నేహలత దంపతులు ఘనంగా సన్మానించారు. మంగళవారం కరీంనగర్ క్యాంపు కార్యాలయంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్‌లను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ స్నేహలతలు శాలువ, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన అధికారులు



మొక్కలకు నీరు పోస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణ, అధికారులు

మెట్‌పల్లి రూరల్, జూలై 9: మండలంలోని బండలింగాపూర్ గ్రామంలో మండల అధికారులు మొక్కలు నాటారు. మంగళవారం వనమహోత్సవం కార్యక్రమాన్ని ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణ, అటవీశాక అధికారి షౌకత్ అలీలు మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మండల అధికారులు, అటవీ శాఖ అధికారులతో పాటు అంగన్‌వాడీ టీచర్లు మొక్కలు మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించగా ఉపాధి హామీ, పంచాయతీ కార్మికులు 1000ఈత మొక్కలు నాటి నీరు పట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వనమహోత్సవ కార్యక్రమంలో గ్రామస్థులు భాగస్వాములై మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. మొక్కలు నాటడడంతో ప్రకృతిని కాపాడినవారువుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి, ఏపీఎమ్ తిరుపతిరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధిహామీ కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు.

కల్లెడ ప్యాక్స్‌ను సందర్శించిన నాబార్డు అధికారులు

జగిత్యాలరూరల్, జూలై 9 : జగిత్యాల రూరల్ మండలంలోని కల్లెడ ప్యాక్స్ కేంద్రాన్ని సోమవారం నాబార్డు (నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్) అధికారులు సందర్శించారు. ఈసంధర్భంగా నాబార్డు డీజీఎం సంఘం వ్యాపారాలు, ఎరువులు, విత్తనాల అమ్మకం, అప్పుల బట్వాడా వసూళ్లు ఇతర అంశాల గురించి సలహాలు సూచనలు చేశారు. నాబార్డ్ ఏజీఎం శ్రీకాంత్, డీడీఎం దిలీప్,నాబార్డు జనరల్ మేనేజర్ పీటీ ఉష, ప్యాక్స్ చైర్మన్ సందీప్‌రావు, ప్యాక్స్ సిబ్బంది పాల్గొన్నారు.

జగిత్యాలలో పోలీసుల విస్తృత తనిఖీలు

జగిత్యాల టౌన్, జూలై 9: జిల్లా కేంద్రంలోని పోచమ్మవాడ, నాయుడు చౌరస్తా తదితర ప్రాంతాల్లో మంగళవారం రాత్రి టౌన్ సీఐ వేణు గోపాల్ ఆ ధ్వర్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. పత్రాలు లేని వాహన యజమానులకు జరిమానాలు విధించారు. ఎస్సై నరేష్ ఉన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కోరుట్ల, జూలై 9 : పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోని అంటు వ్యాధుల నివారణకు పట్టణ ప్రజలు సహకారం అందించాలని మున్సిపల్ కమీషనర్ తిరుపతి అన్నారు. మంగళవారం పట్టణంలోని వివిధ ప్రాంతాలలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

అటకెక్కిన ఆహ్లాదం

● మూలక పడ్డ బోట్ ● పేరుకుపోయిన గుర్రపు డెక్క



మూలకు పడిన బోట్

కోరుట్ల, జూలై 9 : పట్టణంలోని మిని ట్యాంక్ బండ్‌లో ఆహ్లాదం అటకెక్కింది. ఎన్నికల ముందు ఓట్లకోసమో మరి దేనికోసమో తెలియదు కానీ సందర్శకులకు బోటింగ్ నిర్వహించడంతో సంబర పడిపోయారు. కానీ అది అప్పటి వరకే అని ఊహించలేదు. అయితే ఎన్నికల అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు కనీసం అటు వైపు కూడా కన్నెత్తి చూడకపోవడంతో బోటింగ్ కాస్త మూలకు పడింది. పదేళ్ల క్రితం నూతనంగా ఏర్పడిన బీఆర్ఎస్ ప్రభుత్వం కోరుట్ల పట్టణంలో మినీ ట్యాంక్ బండ్ నిర్మాణానికి రూ. 25 కోట్లను మంజూరు చేసింది. అప్పటి మంత్రి హరీష్‌రావుతో అప్పటి ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు ఆధ్వర్యంలో పనులు కూడా ప్రారంభించారు. కొన్నేళ్ల పాటు అభివృద్ధి పనులు కొనసాగుతూనే ఉన్నాయి. రాష్ట్రం ఏర్పడి పదేళ్లు పూర్తయింది. తాజాగా జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓ డిపోయి కాంగ్రెస్ కూడా అధికారంలోకి వచ్చింది. కానీ ఇప్ప టి వరకు పట్టణ ప్రజలకు ఆహ్లాదం అదడంలో మాత్రం తీవ్ర జాప్యం చోటు చేసుకుని మినీ ట్యాంక్ బండ్ పనులు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు అప్పటి టూరిజం శాఖ ఆధ్వర్యంలో బోటింగ్‌ను ఏర్పాటు చేశారు. కొద్ది రోజులు బోటింగ్ చేసిన పట్టణ ప్రజలకు అది మూడు రోజుల ముచ్చటగా మిగిలి పోయింది. ఎన్నికల ముందు జరిగిన బోటింగ్ ఎన్నికలు పూర్తి కాగానే మూలకు పడిపోవడంతో పాటు బోట్‌ను నిర్వాహకులు చెరువులోని ఓ మూలకు పడే యడం కొసమెరుపు.

● పేరుకుపోయిన గుర్రపు డెక్క

చెరువు పూర్తిగా గుర్రపు డెక్కతో నిండిపోయింది. చెరువులో కనీసం నీరు ఉందా లేదా అన్న రీతిలో తయారైంది. మూడు సంవత్సరాల క్రితం చెరువులో ఇదే పరిస్థితి ఉండంగా మున్సిపల్ పాలక వర్గ సభ్యులు ప్రత్యేక నిధులను కేటాయించి గుర్రపు డెక్కను తొలగించారు. ప్రస్తుతం ఇప్పుడు గుర్రపు డెక్క తొలగించి చెరువును శుభ్రం చేయడానికి అధికారులు చొరవ చూపకపోవడంతో గుర్రపు డెక్క చెరువు పరివాహక ప్రాంతంతో పాటు మాటు కాల్వలో కూడ మొలుస్తూ ముందుకు కొన సాగుతుంది.

● నిలిచిపోయిన పనులు

ట్యాంక్ బాండ్‌పై అభివృద్ధి పనులు అసంపూర్తిగా మిగిలి ఉన్నాయి. పదేళ్లగా పట్టణ ప్రజలు ఎదురు చూస్తున్న ఆహ్లాదం అందడం లేదు. చెరువుకు ఇరువైపుల బండ్ నిర్మాణం చేయవలసిన అధికారులు అసంపూర్ణంగా ఉంచారు. మినీ ట్యాంక్ బండ్‌పై స్టాల్స్ నిర్మాణంతోపాటు లైటింగ్ నిర్మాణం చేయాల్సి ఉండగా వాటి నిర్మాణం పూర్తి చేయక పోవడంతో మందు బాబులకు అడ్డాగా మా రాయి. రాత్రి వేళలో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారినట్లు పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికరులు ప్రత్యేక చర్యలు తీసుకుని ట్యాంక్ బండ్ అభివృద్ధి చేసి బోటింగ్‌ను నిర్వహించి పట్టణ ప్రజలకు ఆహ్లాదం అందివ్వాలని కోరుతున్నారు.

గుర్రపు డెక్క తొలగించడానికి చర్యలు

తిరుపతి, మున్సిపల్ కమిషనర్



మద్దుల చెరువులో పురుకపోయిన గురెపు డెక్క తొలగించడానికి ప్రత్యేక చర్యలు చెపడు తాం. చెరువులో ఆహ్లాదం నింపడానికి బోటింగ్ నిర్వహించి పట్టణ ప్రజల కోసం ట్యాంక్ బండ్ నిర్మాణం పూర్తి విదం గా పూర్తి అయ్యే విధంగా ప్రభుత్వం దృష్టికి పాలకవర్గ సభ్యులతో కలిసి తీసుకపోతాం.



చెరువులో పేరుకపోయిన గుర్రపు డెక్క.

ట్యాంక్ బండ్ నిర్మాణం పూర్తి చేయాలి

బైరీ విజయ్ కుమార్ (న్యాయవాది)



ట్యాంక్ బండ్ నిర్మాణం పూర్తి చేసి పట్టణ ప్రజలకు ఆహ్లాదం నింపాలి. చెరువులో ఏర్పాటు చేసి బోటింగ్‌ను పునఃప్రారంభించే విధంగా పాలకవర్గ సభ్యులు చొరవ చూపాలి. ఎన్నికల ముందు బోటింగ్ ఏర్పాటు చేసి మళ్లీ మూలకు పడేయడంతో బోట్ కూడా నిరుపయోగంగా మారింది.

చివరి ఆయకట్టు వరకు సాగు నీరందాలి

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



మల్లాపూర్‌లో చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

మల్లాపూర్, జూలై, 9 : రైతులకు సాగు చేస్తున్న పంటల కోసం చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా ఇరిగేషన్ అధికారులు తగు చర్యల్లో భాగంగా పనులు చేపట్టాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ సూచించారు. మంగళవారం మండలంలోని మల్లాపూర్, గొర్రెపల్లి, రేగుంట శివారులోని గల చెరువులను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. గ్రామాల్లో గండి పడ్డా చెరువులకు మరమ్మతులు చేపట్టి చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను కోరారు. వర్షం దాటికి దెబ్బతిన్న చెరువులను ఎమ్మెల్యే పరిశీలించగా పంటలు నష్టపోయమని రైతులు తమ ఆవేదన వెలిబుచ్చారు. ప్రతి సాగు భూమికి నీరు అందుతుందని ఎమ్మెల్యే రైతులకు భరోసా ఇచ్చారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు పనులు చేపట్టాలని, అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం చేయవోద్దని పలు సూచనలు చేశారు. ఈయన వెంట ఇరిగేషన్ అధికారులు, నాయకులు

చెక్ డ్యాంలను అభివృద్ధి పరచాలి

కోరుట్ల రూరల్ : రైతుల ప్రయోజనాల కోసం ఏర్పాటు చేసిన వాగులపై ఏర్పాటు చేసిన చెక్ డ్యాంలను అభివృద్ధి పరుచాలని కోరుట్ల ఎమెమ్మల్యే డాక్టర్ సంజయ్ అన్నారు. మంగళవారం మండలంలోని మాదాపూర్ గ్రామ శివారులోని వాగుపై నిర్మాణం చేసిన చెక్కు డ్యాంను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. డ్యాం వరకు ఎమ్మెల్యే ట్రాక్టర్ సహాయంతో చేరుకుని చెక్ డ్యాం వివరా లను ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడారు. రైతుల సౌకర్యాల కోసం గత ప్రభుత్వం వాగులపై భూగర్భ జలాలు పెరగడానికి చెక్ డ్యాంను నిర్మించామన్నారు. రైతుల సమస్యలను పరిష్కరిచడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. సర్పంచ్‌ల పోరం జిల్లా అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, సింగిల్ విండో చైర్మెన్ ఆదిరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం

కథలాపూర్, జూలై 9 : మండలంలోని పోసానిపేటలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రభుత్వం మంజూరు చేయడం పట్ల గ్రామస్థులు హర్షం వెలిబుచ్చుతున్నారు. మంగళవారం గ్రామ రైతులు గ్రామపంచాయతీ వద్ద ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటంకు క్షీరాభిషేకం చేశారు. సుమారు రు. 2.02 కోట్ల అంచనా వ్యయంతో సబ్‌స్టేషన్ నిర్మిస్తుండడం వల్ల లోవోల్టేజీ సమస్య పరిష్కారం కానుందని రైతాంగం పేర్కొన్నారు. మాజీ సర్పంచ్ ఎంజీరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు, సత్యనారాయణ, రైతులు ఉన్నారు.

టీడీపీలో చేరిక

జగిత్యాల అర్బన్, జూలై 9: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు బీసీ యూనైటెడ్ ఫ్రంట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లం సతీష్ కుమార్ టీడీపీ నిజామాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు దేగాం యాదగౌడ్ సమక్షంలో టీడీపీ పార్టీలో చేరగా ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా యాదగౌడ్ మాట్లాడుతూ టీడీపీ అధినేత ఆదేశాలు, సూచనల మేరకు పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బాధ్యులు సోమ నారాయణ రెడ్డి, అక్కినపల్లి కాశీనాథం, కొండ శ్రీధర్, ఓరు గంటి భార్గవ్, శ్రీనివాస్‌బాబు, రాజగంగారాం, సత్యం, గోవర్ధన్ గౌడ్, శంకర్ తదితరులున్నారు.

కళాభిమానుల ప్రోత్సాహంతోనే గుర్తింపు

జగిత్యాల టౌన్, జూలై 9: కళాభిమానుల ప్రోత్సాహంతోనే జాతీయ స్థాయిలో తగిన గుర్తింపు లభించిందని ప్రముఖ జాతీయ జానపద రచయిత, గాయకుడు మురళీ మధు అన్నారు. తెగిపడ్డ నింగి చుక్కలం అనే పాటతో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న కరీంనగర్ జిల్లాకు చెందిన మురళీ మధు మంగళవారం జిల్లా కేంద్రంలో పర్యటించారు. జిల్లా కేంద్రంలో వివిధ రంగాల్లో ప్రతిభ చూపుతున్న కళాకారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీ మధును కళాశ్రీ ఆర్ట్ థియేటర్ అధినేత గుండేటి రాజు ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కళాకారుడు కొమురవెల్లి లక్ష్మీనారాయణ, రవిచంద్ర, ఏపీఎల్ఎన్ చారి, లక్ష్మి ఉన్నారు.

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ వేడుకలు



జెండా ఆవిష్కరించిన ఏబీవీపీ నాయకులు

జగిత్యాల అర్బన్, జూలై 9: జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్థానిక పాత బస్టాండ్‌లో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) 75 ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సామాజిక సమరసత ప్రముఖ్ బెజ్జంకి సంపూర్ణచారి హాజరై, ఏబీవీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1949 జూలై 9న ఢిల్లీ విశ్వ విద్యా లయంలో కేవలం 5 మందితో ప్రొఫెసర్ ఓం ప్రకాశ్ బెహల్ నాయకత్వంలో జాతీయవాద భావాలతో సంఘం ఏర్పాటైం దన్నారు. జిల్లా అనేక త్యాగాలకు ప్రతీక అని, ఈ జెండా కోసం అమరులైన రామన్న, గోపన్న, జితేందర్ రెడ్డి, మధుసూధన్ గౌడ్‌లను స్మరిం చుకుంటూ వారి ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగాలన్నారు. దేశంలో అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఏబీవీపీ ఎదిగిందని, ప్రతి విద్యార్థికి జాతీయ విద్యార్థి దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఏబీ వీపీ బాధ్యులు రాపాక సాయి, కుందారపు రాజు, శ్రీనివాస్, మనోహర్, కళ్యాణ్, ప్రశాంత్, విష్ణు పాల్గొన్నారు.

రాయికల్: రాయికల్ పట్టణంలో మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో 76వ విద్యార్థి దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా రాయికల్ నగర కార్యదర్శి బన్న హరీష్ మాట్లాడుతూ దేశం కోసం, విద్యార్థుల కోసం నిరంతం పని చేసే ఏబీవీపీ 1949, జూలై 9న ఏర్పడి ఈరోజుకు 76 సంవత్సరాలు గడిచిందని తెలిపారు. విద్యార్థుల సమస్యలపై ఎల్లప్పుడూ పోరాటం చేయడానికి ఏబీవీపీ ముందంజలో ఉంటుందని తెలిపారు.

ఆర్యవైశ్య జిల్లా అధ్యక్ష పదవి ఎన్నికకు నోటిఫికేషన్ జారీ

జగిత్యాల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఆర్యవైశ్య సంఘ నూతన అధ్యక్షుడి ఎన్నికకు నోటిఫికేషన్‌ను మంగళవారం సంఘ జిల్లా అధ్యక్షుడు కొత్త సురేశ్ జారీ చేశారు. 2024-2026 సంవత్సరములకు గానూ నూతన అధ్యక్షుడి ఎన్నికకు షెడ్యూల్‌ను ప్రకటించారు. ఈనెల 28వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యా హ్నం ఒంటి గంట వరకు నామినేషన్ పత్రాల స్వీకరణ, మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు నామినేషన్ల పరిశీలన, ఈనెల 29వ తేదీన మధ్యాహ్నం ఒంటి గంట వరకు నామినేషన్ల ఉప సంహరణ, అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రకటన చేయనున్నట్లు వెల్లడించారు. ఈనెల 31వ తేదీన ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జిల్లా వైశ్య సంఘ భవనములో పోలింగ్, అనంతరం కౌంటింగ్, ఫలితాల ప్రకటన చేయనున్నట్లు తెలిపారు. ఆర్యవైశ్య మహా సభ నిబంధనలను అనుసరించి ఈ పర్యాయం ఎన్నికలలో పోటీ చేయడానికి మెట్‌పల్లి రెవెన్యూ డివిజన్‌కు చెందిన వ్యక్తులు మాత్రమే అర్హులుగా పరిగణించబడుతారని ప్రకటించారు.

మాజీ ఎంపీటీసీలు, ఎంపీపీలకు సత్కారం



మాజీ ఎంపీపీ దంపతులను సన్మానిస్తున్న రామగుండం మాజీ ఎమ్మెల్యే చందర్

మెట్‌పల్లి రూరల్, జూలై, 9 : మండలంలోని వేంపేట గ్రామంలోని ప్రజల సహకారంతోనే అభివృద్ధి చేసే అవకాశం కల్గిందని మాజీ ఎంపీటీసీ పుల్ల చంద్రశేఖర్‌గౌడ్ అన్నారు. గ్రామ ఎంపీటీసీగా ఐదు ఏళ్ల పదవి కాలం పూర్తి కావడంతో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, ప్రజలు మంగళవారం శాలువలు, పూలమాలతో ఘనంగా సన్మానించారు. మాజీ ఎంపీటీసీ మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరచడానికి సహకరించిన నాయకులు, ప్రజలకు ప్రత్యేక అభినందనాలు తెలిపారు. కార్యక్రమంలో మెట్‌పల్లి ప్రైవేటు స్కూల్ యాజమాన్యం అధ్యక్షుడు పుల్ల ప్రదీప్‌గౌడ్, దశకంఠరాజు, అంజిరెడ్డి, గంగాధర్, శ్రీనివాస్‌గుప్తా, శేఖర్, ధర్మరాజు పాల్గొన్నారు.

ఎండపల్లి : పాలకుర్తి మాజీ ఎంపీపీ వ్యాళ్ల అనసూర్య దంపతులకు రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ స్వగ్రామమైన ఎండపల్లి మండలం ముంజంపల్లి గ్రామంలో ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చందర్ మాట్లాడుతూ తమ కుమారుడి పేరు మీద వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ స్థాపించి పాలకుర్తి మండలంలో నిరుపేదలకు ఎంతో మందికి సహాయం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పెగడపల్లి: పెగడపల్లి తాజా మాజీ ఎంపీటీసీ సభ్యురాలు బొమ్మెన జమున స్వామి దంపతులకు మంగళవారం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ నెల 4న పదవీ కాలం ముగియగా మంగళవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో ఎ.శ్రీనివాస్ రెడ్డి హాజరై మాట్లాడుతూ ఎంపీటీసీ పదవికి మాత్రమే మాజీలు అయ్యారు తప్ప ప్రజా సేవకు కాదని, ప్రజాసేవ చేసే వారికి ఎప్పుడైనా ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేయొచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవోతో శ్రీనివాస్ రెడ్డితో పాటు, ఎంపీవో మహేందర్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, మాజీ సర్పంచులు మేరుగు శ్రీనివాస్, రాజు, నాయకులు పాల్గొన్నారు.

ఆషాఢం..అతివల సందడి



సంబరాల్లో పాల్గొన్న మహిళలు

జగిత్యాల టౌన్, జూలై 9: ఆశాఢ మాసాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో మహిళలు సందడి చేశారు. పట్టణంలోని పద్మనాయక కళ్యాణ మండపంలో మంగళవారం 100 మందికిపైగా మహిళలు ఒకే వేదికపైకి చేరుకుని ఆషాఢమాస సంబరాల్లో భాగంగా. చేతులకు గోరింటాకు పెట్టుకున్నారు. అనంతరం గోరింటాకు విశిష్ఠతపై మహిళకు మహిళా నాయకురాళ్లు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళలు ఉన్నారు.

పులివేషాల సందడి



పులి వేషాల్లో యువకులు

మల్యాల, జూలై 9: మొహర్రం సందర్భంగా గ్రామాల్లో పెద్దపులి వేషాల సందడి నెలకొంది. గ్రామాల్లో పీరీలను ప్రతిష్టడంతో యువకులు పదుల సంఖ్యలో పులివేషాలను ధరించి ఆటలతో ఆకట్టుకుంటున్నారు. వారం రోజుల పాటు పులివేషాలు జోరుగా ఆకట్టుకోనున్నాయి.

సంక్షిప్త సమాచారం

జగిత్యాల : రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కాల్వ సుజాతను మంగళవారం జిల్లా అవోపా నాయకులు పబ్బా శ్రీనివాస్ సన్మానించారు.

మల్యాల : కొండగట్టు, తాటిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని పలు గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్ప డనున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు. కొండగట్టు ఫీడర్ నందు చెట్ల కొమ్మలు తొలగించనున్నందున కొండగట్టు, బల్వంతాపూర్, సర్వాపూర్, తాటిపల్లి, లంబాడిపల్లి గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ధర్మపురి: మండలంలోని జైనాకు చెందిన ఎక్సోటీ బాలవీర్ ఇటీవల రైలు ప్రమాదంలో మృతి చెందడంతో అతని మిత్రులు రూ. 30వేలు పోగు చేశారు. మృతుడి కుమారుడికి వాటిని అందజేశారు. మాజీ సర్పంచ్ కుడిక్యాల మహేష్, మాజీ ఉపసర్పంచ్ గంగారాం, కృష్ణ, దేవరకొండ చారి, రామగిరి రవి, బాలచందర్ పాల్గొన్నారు

●ధర్మపురి మండం రాజారాం గ్రామానికి చెందిన బీసు శ్రావణ్ అనే వ్యక్తికి మంగళవారం సీఐ రాం నరసింహారెడ్డి ఆధ్వర్యంలో తను పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసులు అప్పగించారు. శ్రావణ్ రెండు రోజు క్రితం తన ఫోన్‌ను పోగోటుకున్నాడు. అతను ఇచ్చిన ఆధారాల సహాయంతో ఫోన్‌ను శ్రావణ్‌కు అందించారు.

●కలెక్టర్ ఆదేశాల మేరకు ధర్మపురి పట్టణంలోని ఒకటవ వార్డులో పారిశుధ్యంపై ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఇందారపు రామయ్య మేనేజర్ గంగాధర్ పాల్గొన్నారు.

●మండలంలోని నాగారం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు గడ్డం భాస్కర్ రెడ్డికి ఇటీవల మోకాలి శస్త్ర చికిత్స జరిపించుకొని ఇంటికి రాగా ఆయనను ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పరామర్శించారు. టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్ పాల్గొన్నారు.

బీర్‌పూర్ : కులం పేరుతో దూషించిన వ్యక్తిపై మంగళవారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బీర్‌పూర్ ఎస్సై కుమారస్వామి తెలిపారు. తనను చంపేస్తామని బెదిరించినారని రాజేశ్వర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నటు ఎస్సై తెలిపారు.

కొడిమ్యాల : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన రేషన్ బియ్యం అందించాలని బీజేపీ నాయకుడు బోగ రాకేష్ అధికారులను కోరారు. మంగళవారం ఆయన వి లేకరులతో మాట్లాడుతూ మండల కేంద్రంలోని ఒక రేషన్ షాపులో ఇటీవల పంపిణీ చేసిన బియ్యంలో లక్క పురుగులు వచ్చాయని ఆయన ఆరోపించాడు.

గొల్లపల్లి: మండలంలోని రాఘవపట్నం గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ దుమల్ల గంగయ్య గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందగా గ్రామస్థులు మంగళవారం ఆయన కుటుంబానికి రూ.43,200 ఆర్థిక సహాయం అందజేశారు. మాజీ సర్పంచ్ శంకరయ్య, మాజీ ఎంపీటీసీ రాజేందర్ గౌడ్ పాల్గొన్నారు.